హామీలే మిగిలె..!



అచ్చెన్న ఇచ్చిన హామీతో టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ కళాశాలగా మారేదెన్నడో...

కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా పండగ చేసుకుంటున్న పాలకుల తీరును చూసి ప్రజలు విస్తుపోతున్నారు. సూపర్‌సిక్స్ పేరిట హడావిడి చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తర్వాత వాటి సంగతే మర్చిపోవడంతో అన్ని వర్గాల్లోనూ అసహనం నెలకొంది. ముఖ్యంగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు తమను గెలిపిస్తే నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పినా.. కార్యాచరణలో మాత్రం ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. అమలుకాని హామీలను ఇచ్చిన ప్రజాప్రతినిధులను నిలదీసేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు.

• గాలికొదిలేశారు

- హామీలను విస్మరించిన ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు
- సమీక్షలతో సరిపెడుతున్న వైనం

టెక్కలి: ఈ సారి ఎన్నికల్లో గెలిస్తే టెక్కలి నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా మారుస్తామని ప్రస్తుత మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారంలో ఆర్భాటంగా ప్రకటించారు. వీటితో పాటు నియోజకవర్గ ప్రజలకు మరికొన్ని హామీలను గుప్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడిచినప్పటికీ ఆయా హామీలపై కనీసం దృష్టి సారించడం లేదు.

- టెక్కలిలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇంతవరకు ఆ దిశగా అడుగులు పడలేదు.
- టెక్కలిని జిల్లా కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చి ఆ మాటే మర్చిపోయారు.
- టెక్కలి నియోజకవర్గంలో సుమారు వెయ్యి కోట్ల రూపాయలతో వంశధార లైనింగ్ పనులు చేపడతామని హామీ ఇచ్చినా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది.
- గ్రామాల్లో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు అందజేస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు.
- ఎటువంటి వలసలు లేకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు.
- ఆఫ్‌షోర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చి గాలికొదిలేశారు.
- చీపుర్లపాడు కూరగాయల బజార్ వద్ద కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు, కోటబొమ్మాళిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, వంశధార కాలువలపై కన్నెవలస, కిష్టుపురం, పాకివలస వద్ద కొత్త బ్రిడ్జిలు నిర్మిస్తామని చెప్పినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.


ఎమ్మెల్యే కె.అచ్చెన్నాయుడు

• ప్రకటనలకే పరిమితం

- అమలు కాని ఎమ్మెల్యే గౌతు శిరీష వాగ్దానాలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతు శిరీష ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారు. ప్రతి చేతికీ పని–ప్రతి చేనుకు నీరు అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చి ఇప్పటికి ఒక్కరికీ పని కల్పించలేదు.

- కాశీబుగ్గ ఫ్లై ఓవర్ వంతెన పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా తర్వాత ఆ సంగతే మర్చిపోయారు.
- పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో 70 వేల మంది జనాభాకు 6 ఎంఎడీ నీటిని సరఫరా చేస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు.
- పలాస నియోజకవర్గంలో 26 వేల ఎకరాలకు సాగునీరు అందించే మహేంద్రతనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులను పట్టించుకున్న దాఖలాలు లేవు.
- మందస మండలంలో దామోదరం సాగరంను రిజర్వాయర్‌గా మారుస్తామని, చిన్న చిన్న సాగు నీరు ప్రాజెక్టు చేపడతామని జాబితా విడుదల చేసినా అమలుకు నోచుకోలేదు.
- పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో రూ.2 కోట్లతో నిర్మించాల్సిన ఇండోర్ స్టేడియం పూర్తి చేస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు.
- జీడి పంటకు మద్దతు ధర ప్రకటిస్తామని చెప్పి గాలికొదిలేశారు. జీడి కార్మికులకు ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మిస్తామని చెప్పి మర్చిపోయారు.
- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పెట్టి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. వజ్రపుకొత్తూరు మండలంలో బెండిగేటు–పూండి రోడ్డును డబుల్ చేస్తామని, నువ్వలరేవు వంతెన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని, పలాసలో కేంద్రియ విద్యాలయం నిర్మిస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు.



అసంపూర్తిగా నిలిచిన ఆఫ్‌షోర్ ప్రాజెక్టు


ఎమ్మెల్యే గౌతు శిరీష

• వంద రోజుల వంచన

- హామీలకే పరిమితమైన ఎమ్మెల్యే అశోక్
- ప్రజలకు తప్పని ఎదురుచూపులు

కంచిలి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పలు దీర్ఘకాలిక సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత శాసనసభ్యుడు బెందాళం అశోక్ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడిచినా ఎటువంటి హామీలను నెరవేర్చలేదని నియోజకవర్గ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

- ఈదుపురం, కుత్తుం, రుషికుద్ద, బెంకిలి, జగతికేశుపురం ఎత్తిపోతల పథకాల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు పనుల్లో కదలిక రాలేదు.
- బాహుదా నదిలో శిథిలావస్థకు చేరి, పిచ్చిమొక్కలతో నిండి ఆయకట్టు పొలాలకు నీరందించని 11 ఓపెన్ హెడ్ చానల్స్ అభివృద్ధి చేస్తానని ఆర్భాటంగా ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.
- సిలగాంలో కొబ్బరి పార్కు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదు.
- నియోజకవర్గంలో పాడైన రోడ్లను అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి చేస్తామని చెప్పినా ఇంతవరకు బాగు చేయలేదు.
- మేజర్, మైనర్ ఇరిగేషన్ పరిధిలో సాగునీటి వనరుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.


బొడ్డబడ బాహుదా వంతెన ఆనుకొని ఉన్న చానెల్ దుస్థితి

ఇచ్ఛాపురం


ఎమ్మెల్యే బెందాళం అశోక్

క్లుప్తంగా

ఆస్పత్రిలో వార్డుల విభజన


మూడో అంతస్తులో మహిళలకు కేటాయించిన వార్డు

సాక్షి ఎఫెక్ట్...

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో మహిళలు, పురుషులకు ఎట్టకేలకు వేర్వేరు వార్డులను ఏర్పాటు చేశారు. 'వార్డుల కొరతతో ఇక్కట్లు' శీర్షికను శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి వైద్య అధికారులు స్పందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తమ్మినాన పాపినాయుడు మేల్, ఫీమేల్ వార్డులను విభజన చేశారు. మూడో అంతస్థులోని రెండు గదులను మహిళలకు, పురుషులకు వేర్వేరుగా కేటాయించారు. రెండు వార్డులు కలిపి ఉన్న గదిలో ఉన్న మంచాలను తొలగించారు. మూడు అంతస్థులకు లిఫ్ట్ సౌకర్యం ఉండటంతో ఆసుపత్రిలో సేవలు విస్తరిస్తున్నారు.

ఆశ్రమ నిర్వహణకు వితరణ


విరాళాన్ని అందిస్తున్న సిద్ధి వినాయక పూజా కమిటీ సభ్యులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో స్టేట్‌బ్యాంకు ఎదురు వీధిలోని సిద్ధి వినాయక పూజా కమిటీ సభ్యులు మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ నేతృత్వంలో నిర్వహిస్తున్న వాన ప్రస్థాశ్రమంలో వృద్ధులు, అనాథలు, నిరుపేద విద్యార్థుల మౌలిక వసతి, అన్నదానం కోసం రూ.20వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. ఏటా వినాయక చవితి సందర్భంగా నిర్వహించే అన్నదానానికి బదులుగా ఈ సాయం చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు గుళ్ల రమేష్ పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ


విద్యార్థులతో ఉపాధ్యాయులు

కంచిలి: మండలంలోని నువాగడ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు టొంకాధర దొళాయి, చంద్రమణి గొమాంగోలు రూ.20వేలు విలువైన క్రీడా దుస్తులను శుక్రవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాప్రసాద్ పాఢి, వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


మొక్క నాటుతున్న సర్పంచ్

పలాస: కాలుష్యాన్ని నివారించడానికి ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్ కోరారు. బొడ్డపాడు సచివాలయంలో పరిధిలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీనాకుమారి, ఏఈఓ పావని, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష సాయం


ఎమ్మెల్యే శిరీషకు చెక్ అందిస్తున్న విద్యార్థులు

కాశీబుగ్గ: విజయవాడ వరద బాధితులకు పలాసకు చెందిన మదర్ థెరిస్సా స్కూల్ విద్యార్థులు రూ.లక్ష వితరణ చేశారు. ఈ మొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేయాల్సిందిగా చెక్ రూపంలో ఎమ్మెల్యే గౌతు శిరీషకు అందించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వజ్జ భవానీ, సిబ్బంది రూప ప్రసాద్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతులు

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బూర్జపాడు పంచాయతీ స్థాయిలో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రామ సచివాలయం సిబ్బంది బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జె.సరోజినీ, డిజిటల్ అసిస్టెంట్ హేమంత్, ఎల్.గోవిందరావు, వెంకటరమణ, వజీర్, శ్రీమరి, శంకర్‌రెడ్డి, కృష్ణారావు, స్వాతి, గణపతి, నూకయ్య, సువర్ణ, లక్ష్మీ, లోకేశ్, సూర్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ పోటీలు

టెక్కలి: టెక్కలి మండలం లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయిలో స్కూల్ గేమ్స్, గ్రిగ్స్ పోటీల్లో భాగంగా బాల బాలికలకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సర్పంచ్ ఎస్.లక్ష్మి, మాజీ ఎంపీపీ ఎస్.రాఘవరావు, మాజీ సర్పంచ్ ఎస్.సుజాత, ఎంఈఓలు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. అండర్–14, 17 విభాగాల్లో జరిగిన ఈ ఎంపికల్లో భీంపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల తదితర జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జి బి.నారాయణ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, ఎల్.నీలకంఠేశ్వరరావు, ఆదిశేషు, సూర్యకాంతం, జగ్గమ్మ, లక్ష్మణరావు, వెంకటరమణ, శ్యామల రావు, రీతీసోనా, దివ్యవాణి, ఢిల్లేశ్వరి, నీలయ్య, జగదీష్, రమేష్, ఇంద్రాణి, మీనాక్షి పాల్గొన్నారు.


టెక్కలి : విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పలాస నియోజకవర్గ కబడ్డీ ఖోఖో, వాలీబాల్ బాల బాలికల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా జరిగాయి. హెచ్‌ఎంలు డి.దాశరథి, టి.చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరావు, ఎంఎస్‌ఓలు సీహెచ్ పద్మలోచనం, ఎస్.రామారావు, ఎస్.చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకరరావు, లోకేశ్వరరావు, నారాయణ, హరినాథ్, గీత, రమ్య, విజయ్, సంతోష్, రాజారాణి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారుల నిరసన


టెక్కలి పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న ఫుట్‌పాత్ దుకాణదారులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో ఫుట్‌పాత్ దుకాణదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి స్థలాలు చూపేంతవరకు పాత స్థలంలోనే అమ్మకాలు చేస్తామని, దీనికి అధికారులు సహకరించాలని డిమాండ్ చేస్తూ ఆయా వ్యాపారులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఇందిరాగాంధీ విగ్రహం నుంచి పట్టు మహదేవి కోనేరు గట్టు వరకు ఉన్న ఫుట్‌పాత్ దుకాణాలు తొలగించి రోజులు గడుస్తున్నా ప్రత్యామ్నాయం ఉపాధి స్థలాలు చూపించడం లేదని వాపోయారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పాత స్థలంలోనే అమ్మకాలు చేస్తామని విన్నవించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు హెచ్.ఈశ్వరరావు, కె.ఎల్లయ్య, యు.లక్ష్మణరావు, న్యాయవాది డి.ధర్మారావు, మాధవరావు, చిన్నమ్మడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించి పండగలా?


మాట్లాడుతున్న జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకులు

కోటబొమ్మాళి: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ప్రజలను మోసగించిన చంద్రబాబు, అచ్చెన్నాయుడు ఇప్పుడు 100 రోజుల పండగలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, నూక సత్యరాజ్, పేడాడ వెంకటరావు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు దొంగ హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు గ్రామాల్లో హడావుడి చేయడం ప్రజలను మరోసారి మోసగించడమేనని దుయ్యబట్టారు. ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ఇంటికి స్టిక్కర్లు అతికించడం బలవంతపు చర్యకాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులంటూ అనేక మందిని ఉద్యోగాల నుంచి తొలగించారని మండిపడ్డారు. ఎన్నికల హామీలు అమలుచేయకుంటే ప్రజలే తిరగబడతారని చెప్పారు. సమావేశంలో ఎంపీటీసీ వాన అసిరినాయుడు, మూల చంద్రంబాబు, కొండాల సిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి

కాశీబుగ్గ: మందస మండలం హరిపురంలో శుక్రవారం మార్పు ట్రస్టు గ్రంథాలయంలో ఎన్ఎంఎస్ మూఢ నమ్మకాలు నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నాలుగు మండలాల కార్యకర్తల సమావేశంలో సీనియర్ కార్యకర్త నల్లహడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. సమావేశంలో ఎస్.కరుణాకర్, జగన్మోహన్‌రావు, దుర్యోధన, కాళిదాసు, తేజేశ్వరరావు, ఈశ్వరరావు, క్రాంతి, ఉమాపతి, నారాయణరావు, కోదండరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో చర్చిస్తున్న సంఘ సభ్యులు

తల్లీకొడుకుల పైకి దూసుకొచ్చిన బస్సు

కాశీబుగ్గ: తల్లీ కొడుకుల పైకి ఆర్టీసీ బస్సు దూసుకొచ్చిన ఘటనలో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. శుక్రవారం పలాస ఆర్టీసీ కాంప్లెక్సు– బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ రోడ్డు– కాశీబుగ్గ బస్టాండ్ రోడ్డుపై తల్లి కొడుకులు తెంబూరు పార్వతి, దుర్యోధన నడుచుకుంటూ వెళ్తుండగా ఆర్టీసీ హయ్యర్ బస్సు ఒక్కసారిగా దూసుకొచ్చింది. ఇద్దరూ టైర్ కింద పడిపోయిన సమయంలో డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఇద్దరికీ గాయాలు కావడంతో డ్రైవర్, కండక్టర్ స్పందించి పలాస సీహెచ్‌సీలో చేర్పించి వైద్యసేవలు అందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఎంపీడీఓ కార్యాలయం షెడ్డులో పార్కుచేసిన తన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని ఉపాధి(డ్వామా) టెక్నికల్ అసిస్టెంట్ కురమాన దామోదర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం విధులు ముగించుకొని సాయంత్రం బైక్‌ను పార్కు చేసి బస్సులో శ్రీకాకుళంలోని తన నివాసానికి వెళ్లిపోయానని, తిరిగి శుక్రవారం వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్షణికావేశంలో నిర్ణయాలతో అనర్థం

టెక్కలి: క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు అనర్థదాయకమని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ కె.శ్రీను అన్నారు. ఆత్మహత్యల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టెక్కలి ఎంజేపీఏపీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదన్నారు. మానసికంగా ఏదైనా సమస్యలు తలెత్తినపుడు వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.అచ్యుత్‌రావు పాల్గొన్నారు.

పరిశ్రమకు విద్యుత్ సరఫరా నిలిపివేత

టెక్కలి రూరల్: మండలంలోని రావివలసలో మెట్కోర్ అల్లాయిస్ పరిశ్రమకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖాధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.4 కోట్లు వరకు విద్యుత్ బకాయిలు ఉండటంతో సరఫరా నిలిపివేసినట్లు ఏఈ పి.ఈశ్వరరావు పేర్కొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలోని అగ్రహారం వీధిలో సూర్యోదయ స్కూల్ ఆవరణలో ఈ నెల 22న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మోణంగి మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నవతరం సేవాసంఘం సౌజన్యంతో మిషన్ తలసేమియాలో భాగంగా జరిగే ఈ కార్యక్రమంలో రక్తదాతలు స్వచ్ఛందంగా పాల్గొనాలని, వివరాలకు 99490 03521 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

కోటబొమ్మాళి: మండలకేంద్రం కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లి ఉత్సవాల నేపథ్యంలో కొత్తగా నాలుగు ట్రాన్సుఫార్మర్‌లను విద్యుత్ శాఖాధికారులు శుక్రవారం ఏర్పాటుచేశారు. ఇటీవల తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నందున మూడు 160 కె.వి.ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక 100 కె.వి.ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసినట్లు ఏఈ బి.వి.సురేష్ తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సన్మానం

కాశీబుగ్గ: పలాస డిపో హెడ్ కానిస్టేబుల్ గురుగుబెల్లి రామమోహనరావుకు గౌరవ డాక్టరేట్, సేవారత్న అవార్డు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం శ్రీకాకుళం ఆర్టీసీ 2వ డిపోలో ఘనంగా సన్మానం చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంట వ్యవధి(హవర్లీ బేసిస్)లో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంటింగ్ టెక్సాస్ ఒకేషనల్ గ్రూప్‌కు బోధించేందుకు ఎం.కాం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆసక్తి గల వారు ఈ నెల 25న జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని పేర్కొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

కాశీబుగ్గ: ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మందస ఎస్‌ఐ ఎస్‌కే ఖాదర్ బాషా హెచ్చరించారు. మందస మండలం హరిపురంలో జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు విడిచి పెట్టే సమయంలో రహదారులపై యువత ఈవ్ టీజింగ్ చేస్తున్నట్లు పోలీసులు దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం హెల్మెట్ ధరించని, ధ్రువపత్రాలు లేని వాహనచోదకుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ శేఖర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

కంచిలి: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంచిలి ఎస్‌ఐ జి.రాజేష్ అన్నారు. మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ కూడలి సమీపంలో స్థానికులతో శుక్రవారం సమావేశమయ్యారు. సైబర్ నేరాలకు దారితీసే పరిస్థితులను వివరించారు.

చిన్నారిపై కుక్కల దాడి

కాశీబుగ్గ: పలాస మండలం పెదంచలలో ఎం.నిషాంత్ అనే రెండేళ్ల బాలుడిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. స్థానికులు సకాలంలో స్పందించడంతో బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.